కమ్యూనిటీ హాల్స్ పురోగతికి బ్రేకులు

- వైఎస్సార్ సీపీ హయాంలోనే పేదల సంక్షేమానికి ప్రాధాన్యత
- ఏలూరులో 30కి పైగా కమ్యూనిటీ హాల్స్‌కు కేటాయింపులు
- 25 బీసీ కులాలకు స్థలాలు, నిధుల కేటాయింపు
- ప్రభుత్వం మారడంతో మందకొడిగా పనులు

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ హయాంలో ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో అడిగిన ప్రతి ఒక్కరికీ కులాల వారీగా కమ్యూనిటీ హాల్స్ మంజూరు చేశారు. ఏలూరు నియోజకవర్గం పరిధిలో 30కి పైగా కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి స్థలాలు, నిధులు కేటాయించి పేదల పట్ల తనకున్న చిత్త శుద్ధిని చాటుకుంది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. నియోజకవర్గంలో కేటాయించిన కమ్యూనిటీ హాల్స్‌లో కొన్ని పూర్తికాగా, 2023 డిసెంబర్ తరువాత బిల్లులు నిలిచిపోవడంతో మరికొన్ని నిర్మాణాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారంలోకి రావడం, వివిధ దశల్లో ఉన్న కమ్యూనిటీ హాల్స్, సమావేశ మందిరాల నిర్మాణం పూర్తికి చొరవ తీసుకోకపోవడంతో ఆయా పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగానున్నాయి.

కేటాయింపులు ఇలా..

వైఎస్సార్ సీపీ ఐదేళ్ల కాలంలో ఏలూరు నియోజకవర్గంలో 25 వివిధ బీసీ సామాజిక తరగతులకు చెందిన వారికి నాటి ఎమ్మెల్యే ఆళ్ల నాని పెద్ద ఎత్తున నిధులు కేటాయించారు. సంఘాల భవనాలు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి విలువైన స్థలాలను కేటాయించారు. ఏలూరులో యాదవ సంఘం జిల్లా, నగర కార్యాలయానికి 350 గజాల స్థలం, ఎమ్మెల్యే, ఎంపీ నిధుల నుంచి రూ.14 లక్షల సాయం అందించారు. రజక సంఘానికి స్థలాన్ని, రూ.14 లక్షలు ఎంపీ, ఎమ్మెల్యే నిధులు అందజేశారు. తెలుకుల సంఘానికి 500 గజాల స్థలం, రూ.10 లక్షలు నిధులు, శ్రీశయన సంఘానికి ఎంపీ, ఎమ్మెల్యే నిధులు రూ.14 లక్షలు అందించారు. గౌడ సంఘ, నాయీబ్రాహ్మణ సంఘాలకు స్థలాలతో పాటు రూ.10 లక్షలు చొప్పున నిధులు అందజేశారు. ఏలూరులో దాదాపు 25కు పైగా బీసీ సంఘాలకు నిధులు, స్థలాలు అందించిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది.

లబ్ధి పొందిన బీసీ కులాలు

వైఎస్సార్ సీపీ హయాంలో 25 బీసీ కులాలు, సంఘాలకు కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం నిమిత్తం స్థలాలు, నిధులు కేటాయించి బీసీల పట్ల తనకున్న ప్రేమాభిమానాలు చాటుకున్నారు. మేదర, కాళింగ, శెట్టిబలిజ, నాయీబ్రాహ్మణ, తెలికుల, పద్మశాలీ, తూర్పుకాపు, సగర, చెంచు, దేవాంగ, నూర్ బాషా, యాదవ, రజక, కొప్పులవెలమ, విశ్వబ్రాహ్మణ, గౌడ, స్వర్ణకార, ప్రైవేట్ ఎలక్ట్రికల్స్, ఏసీ ఎలక్ట్రికల్ వర్క్స్ సంఘం, గణపతి ఖాదీవ్యాపారుల సంక్షేమ సంఘం, ఏపీ సకల కళాకారుల, హేలాపురి వైష్ణవ సేవ సంఘం, బెంగాలి గోల్డ్ స్మిత్, శ్రీ శయన, నాగవంశీయులు తదితర బీసీ కులాలు, సంఘాలకు భవన నిర్మాణాలకు స్థలాలు, నిధులను కేటాయించారు.

నిలిచిన నిర్మాణాలు

ఏలూరు నియోజకవర్గంలో ఎస్సీల కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి పెద్ద ఎత్తున స్థలాలు, నిధులు కేటాయించారు. తంగెళ్లమూడి ప్రాంతంలో మాదిగ భవన్ నిర్మాణానికి, అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలో మాలల భవన్ నిర్మాణాలకు స్థలాలు, నిధులు కేటాయించారు. ఈ నిధుల విడుదల జాప్యం కారణంగా నిర్మాణ పనులు సగంలోనే నిలిచిపోయాయి.



అమీనా పేట ఏటిగట్టు ప్రాంతంలో నిలిచిన మాలమహానాడు భవనం



ఏటిగట్టు ప్రాంతంలో 95 శాతం పనులు పూర్తి చేసుకున్న రజక కమ్యూనిటీ హాలు



నిధుల కేటాయింపులకు సంబంధించి భవనంపై ముద్రించిన దృశ్యం



ఆదివారపుపేటలో నిర్మించిన రజక సంఘ భవనం

గతంలో సంక్షేమానికి పెద్దపీట



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిత్యం పేదల సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేస్తూ వచ్చింది. ఎన్నో ఏళ్లుగా కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవాలనే కలను సాకారం చేసే విధంగా స్థలాన్ని, నిధులు కేటాయించడం గొప్ప విషయం. కొత్త ప్రభుత్వం నిధులు కేటాయించి సగంలో నిలిచిపోయిన నిర్మాణాలను పూర్తి చేయాలి. దీంతో సమావేశాలు, చిన్న చిన్న ఫంక్షన్లు చేసుకునేందుకు వెసులుబాటు ఉంటుంది.

– గారపాటి నాగేశ్వరరావు, ఎస్సీ నాయకుడు, ఏలూరు

త్వరితగతిన పూర్తి చేయాలి



ఏలూరు నగరంలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన వివిధ కులాలు, సంఘాల భవనాలను ప్రస్తుత కూటమి ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. కమ్యూనిటీ హాల్స్ భవనాల్లో అధికంగా బీసీ, ఎస్సీలకు సంబంధించినవే. వీటి నిర్మాణం పూర్తయితే ఆయా వర్గాలకు ఎంతో మేలు జరుగుతుంది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు పనిచేయాలి.

– పి.కిషోర్, సీపీఎం నగర కార్యదర్శి, ఏలూరు

క్లుప్తంగా

శ్రీశ్రీ కళావేదిక కార్యక్రమ పోస్టర్ విడుదల



కళాజాతర పోస్టర్ విడుదల చేసిన దృశ్యం

ఏలూరు (టూటౌన్) : శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 19, 20 తేదీల్లో తాడేపల్లిగూడెం బుద్ధాల కన్వెన్షన్ హాలులో నిర్వహించే 140వ ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతర కార్యక్రమ పోస్టర్‌ను ఎమ్మెల్యే బడేటి చంటి బుధవారం తన క్యాంపు కార్యాలయంలో విడుదల చేశారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీహరికోటి మాట్లాడుతూ సాహిత్య కారులు, కళాకారులు, కళాభిమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శొంఠియాల కస్తూరిరావు, మేతర అజయ్ బాబు, సుజయ్ కృష్ణ పాల్గొన్నారు.

వన్‌టౌన్‌లో అయ్యప్పల భిక్ష



స్వాముల భిక్ష కార్యక్రమంలో పాల్గొన్న జయప్రకాష్

ఏలూరు (టూటౌన్) : స్థానిక వన్‌టౌన్‌లో ఏలూరు అయ్యప్ప అన్నసమారాధ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 20వ వార్షిక శ్రీ అయ్యప్ప స్వామి, మండల దీక్ష స్వాములకు భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ బుధవారం పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు ఏలూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నెరుసు చిరంజీవి, జీఎంఆర్ తదితరులు పాల్గొన్నారు.

వంగాయగూడెంలో ప్రధాన రోడ్డు నిర్మించాలి

ఏలూరు (టూటౌన్): వంగాయగూడెం ప్రాంతంలో ప్రధాన రోడ్డు వెంటనే నిర్మించాలని సీపీఎం పడమర వీధి శాఖ మహాసభ డిమాండ్ చేసింది. సీపీఎం పడమర వీధి స్థానిక శాఖ మహాసభ చేపల చెట్టు సెంటర్‌లోని అప్పారావు గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ఆ శాఖ కార్యదర్శి వైఎస్ కనకారావు మాట్లాడుతూ పడమర వీధి ఏరియా గాంధీ మైదానంలోని మున్సిపల్ గాంధీ మెమోరియల్ హాలు, చేపల చెట్టు సెంటర్‌లోని మున్సిపల్ షాపులను ఉపయోగంలోకి తేవాలని కోరారు. రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా నాయకుడు గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ సూపర్ 6 పథకాలు అన్ని అమలు చేయాలని కోరారు. నగర కార్యదర్శి పి కిషోర్, శాఖ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన సీపీబీ వర్క్‌షాపు



ప్రయోగం చేసి చూపుతున్న విద్యార్థిని

ఏలూరు (టూటౌన్): సెయింట్ థెరిస్సా అటానమస్ కాలేజీలో ఈ నెల 15, 16 తేదీల్లో ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం, విజయవాడకు చెందిన మైక్రోలింక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల సీపీబీ వర్క్‌షాపు బుధవారం ముగిసింది. 15వ తేదీన మూడో సెషన్లో విద్యార్థులు కంప్యూటర్ ల్యాబ్‌లో పీసీపీ విజార్డ్ 3.1.5ని ఉపయోగించి విద్యుత్ సరఫరా, టెస్టర్, నైట్ లాంప్ సర్క్యూట్‌లను రూపొందించారు. రెండు రోజుల వర్క్‌షాపులో విద్యార్థులు సర్క్యూట్ డిజైనింగ్‌పై శిక్షణ పొందారు. ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డ్‌లో ఇచ్చింగ్, సర్క్యూట్లను కనెక్ట్ చేయడంలో నైపుణ్యాలను నేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి ఎ.నిర్మల జ్యోత్స్న మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికితీయడమే కాకుండా భవిష్యత్తులో స్వయంగా నూతన ఆవిష్కరణల రూపకల్పనకు తగిన శిక్షణ ఇచ్చినట్టు చెప్పారు. వర్క్‌షాపుకు విచ్చేసిన రిసోర్స్ పర్సన్స్ సాంబశివరావు, గోవిందరావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.శ్రీలత, అనూష, సరస్వతి, దీప్తి భార్గవి, మాధురి రోజ్‌లు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన అవసరం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై సుబ్బారావు

ఏలూరు (టూటౌన్): సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం సుబ్బారావు అన్నారు. ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ నేరాలపై స్థానిక సత్రంపాడులోని ఆదిత్య డిగ్రీ కాలేజీ విద్యార్థులకు బుధవారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళల భద్రత, పోక్సో యాక్ట్ అనే అంశాలపై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తే డయల్ 112కి సమాచారం అందించిన 10 నిమిషాల వ్యవధిలో పోలీసు రక్షణ కల్పిస్తారని వివరించారు. సోషల్ మీడియా ద్వారా జరిగే సైబర్ నేరాలపై ఎస్పీ సందేశాన్ని వీడియో రూపంలో ప్రదర్శించారు. సైబర్ నేరాలకు గురైతే 1930కి సమాచారం అందిస్తే వారు సహాయ సహకారాలను అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలోమహిళా ఎస్సై కాంతి ప్రియ, సైబర్ సెల్ ఎస్సై మధు వెంకట రాజ, సిబ్బంది, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏలూరు జీజీహెచ్‌లో తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ప్రొఫెసర్ ఉషారాణి, డాక్టర్ సౌజన్య

ఏలూరు టౌన్ : ఏలూరు సర్వజన ఆసుపత్రిలో డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ బృందం తనిఖీలు నిర్వహించింది. ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్ల కేటాయింపుకు సంబంధించి ఏలూరు జీజీహెచ్‌లో సౌకర్యాలను పరిశీలించేందుకు ఈ బృందం బుధవారం ఏలూరులో పర్యటించింది. గుంటూరు మెడికల్ కళాశాల జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ ఉషారాణి, విజయవాడ మెడికల్ కళాశాల గైనకాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ సౌజన్యతో కూడిన ప్రత్యేక బృందం ఏలూరు జీజీహెచ్‌లో ఆయా విభాగాలను పరిశీలించింది. జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఎనస్థీషియా, పీడియాట్రిక్, ఆర్థో, సర్జికల్ విభాగంలో ఒక్కో పీజీ సీటు కేటాయించేందుకు ఈ పరిశీలన చేస్తున్నట్టు వారు తెలిపారు. ఆసుపత్రిలో పరిస్థితులను ఏలూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సుధాకర్, డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు, డాక్టర్ సికిందర్ మోహన్, డాక్టర్ హేమా చౌదరి తదితరులు బృందానికి వివరించారు.

సంక్షేమ బోర్డును పటిష్టం చేయాలి



సదస్సు పోస్టర్ విడుదల చేసిన కార్మికులు

ఏలూరు (టూటౌన్): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పటిష్టం చేయాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ ఏపీ ప్రగతి శీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి నవుడు నెహ్రూబాబు కోరారు. ఈనెల 18వ తేదీన విజయవాడలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం ఏపీ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తంగెళ్లమూడి ఏరియా ఐఎఫ్‌టీయూ స్థూపం వద్ద వాల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నెహ్రూబాబు మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్షా 34 వేల మంది భవన నిర్మాణ కార్మికులు కార్మిక శాఖలో నమోదై ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం సక్రమంగా అమలు కాకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేక ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వర్మ, మత్తే భాస్కర్, కుమార్, నాగూరు, సత్తిబాబు, నారాయణ, సిద్ధయ్య, మహేష్, బాక్సర్ తదితరులు పాల్గొన్నారు.

డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

దెందులూరు: దివ్యాంగ చిన్నారుల లోపాలను గుర్తించి మానవతా దృక్పథంతో ఉపాధ్యాయులు వారికి ప్రత్యేక శిక్షణనివ్వాలని హెచ్ఎం ఎస్ జి శర్మ గ్రంథ పాలకులు గుల్లపూడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో భవిత దివ్యాంగుల పాఠశాలలో డిస్లెక్సియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ డి.సుధీర్ కుమార్, భవిత పాఠశాల సిబ్బంది డి.హేమలత, శ్రీదేవి, చిన్నారులకు సూచనలు సలహాలు ఇచ్చారు.

విద్యార్థుల పారిశ్రామిక సందర్శన



పారిశ్రామిక సందర్శనకు వెళుతున్న కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్ఎం, విద్యార్థులు

దెందులూరు: కొవ్వలి ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులు బుధవారం పారిశ్రామిక సందర్శన చేశారు. ఈ సందర్శనలో భాగంగా కొవ్వలిలో సత్యదేవ రైస్‌మిల్లు, సువేరా రైస్‌మిల్లును వారు సందర్శించారు. వరి పొలాలను వారు పరిశీలించారు. పంటల సాగు విధానం అనంతరం రైసు మిల్లులో బియ్యం, ఊక తదితర ఉత్పత్తి, మార్కెట్‌పై ట్రైనర్స్ సునీల్, రజాక్ వివరించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	21
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	32
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	08
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	28

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	21
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	22
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	10
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	12
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	12
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	16
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	15
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44-48	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	56-96
వంకాయలు (కాంతులు)	40-60	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	32	ములక్కాడలు	07,10
బెండకాయలు	28	కంద	60
పచ్చిమిర్చి	44-48	బీట్‌రూట్	36-44
కాకర కాయలు	36-40	కీరా దోస	36
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	00
బీరకాయలు (పందిరి)	48	అల్లం	70
క్యాబేజీ	32-40	కొత్తిమీర (కట్ట)	20-25
క్యారెట్	48-56	పాలకూర	12
దొండకాయలు	32	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	30-44	గోంగూర	07
గోరుచిక్కుడు	32	పుదీనా	05
దోసకాయలు	32-44	బఠాణీ	--
ఆనపకాయ (1)	25-35	క్యాప్సికమ్	88
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	44

ఆహార అవసరాన్ని గుర్తెరగాలి



దెందులూరు : నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



నిడమర్రు : చిననిండ్రకొలనులో విద్యార్థులు తయారు చేసిన ఆహార పదార్థాల ప్రదర్శన

దెందులూరు: ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి ఆహారం దొరకడంలేదని వారిలో 14 కోట్ల మందిలో పోషకాహార లోపం, ఎదుగుదల లోపం ఉందని, ప్రస్తుత రోజుల్లో ప్రజలు సంప్రదాయ ఆహారం కంటే ఫాస్ట్‌ఫుడ్స్‌కు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారని దెందులూరు నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. ప్రపంచ ఎనస్థీషియా దినోత్సవాన్ని విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ బుధవారం దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆహార పదార్థాలను నర్సింగ్ విద్యార్థులు సిద్ధం చేసి ప్రదర్శించారని అన్నారు. అందరూ ఆహారం అవసరాన్ని గుర్తించాలని అన్నారు. ఎనస్థీషియా ద్వారా రోగికి ఏ చిన్న నొప్పి లేకుండా శస్త్ర చికిత్సలు సులువుగా చేస్తున్నారని అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో వైద్యసేవల్లో విప్లవాత్మకమార్పులు వచ్చాయన్నారు.

చిననిండ్రకొలను స్కూల్లో సందడి

నిడమర్రు: ఆకలి, పోషకహార లోపం,ఆహార భద్రతపై అవగాహన కల్పించేందుకే ఏటా అక్టోబర్ 16న ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహిస్తామని చిననిండ్రకొలను చింతలపాటి మూర్తిరాజు జెడ్పీస్కూల్ హెచ్ఏ పీవీ సత్యనారాయణ అన్నారు. బుధవారం చిననిండ్రకొలను హైస్కూల్లో ప్రపంచ ఆహార దినోత్సవం సందడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల తయారీపై పోటీ నిర్వహించి గ్రామ పెద్ద కొండయ్య ఆర్థిక సహకారంతో విజేతలైన హవీల, మహాలక్ష్మి, అభిరామ్, అనూహ్య, భవ్యసరి, తేరేజమ్మకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షాలతో రైతన్నల ఆందోళన

దెందులూరు: తుఫాన్లు ఏర్పడనున్న కారణంగా 9 రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో రైతన్నలు తీవ్ర కలతచెందుతున్నారు. ప్రస్తుతం పొట్ట, ఈనిక దశలో వరి పైరు ఉంది. ఈ దశకు ఎకరానికి రూ.25 నుంచి రూ.28 వేల వరకు రైతన్న పెట్టుబడి పెట్టారు. ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ ఊసే ఎత్తడం లేదు. ఎన్నికల ముందు అది చేస్తాం, ఇది చేస్తామని హామీలిచ్చి అధికారంలోకి రాగానే కూటమి నాయకులు సూపర్ సిక్స్ హామీలను గాలికి వదిలేశారు. ఒకవైపు కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకానికి మొండి చెయ్యి చూపడంతో అప్పులు తెచ్చి రైతులు సాగుకు పెట్టుబడి పెట్టారు. దెందులూరు మండలంలో 17,846 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన రైతుల ఆశలపై తుఫాన్లు, భారీ వర్షాలు నీళ్లు చల్లుతున్నాయి. వరి పైరు ఈనిక, కంకుల దశలో ఉన్న ఈ సమయంలో మూడు తుఫాన్ల కారణంగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిస్తే తీవ్రనష్టం వాటిల్లుతుందని రైతులు దిగులు చెందుతున్నారు. సోమ, మంగళవారం కురిసిన వర్షానికి రైతన్న తీవ్ర కలత చెందుతున్నాడు. వ్యవసాయశాఖ అధికారులు ఈ స్థాయిలోనే వర్షం రెండు మూడు రోజులు కొనసాగితే వరితోపాటు అన్ని రకాల పంటలకు నష్టం వాటిల్లుతుందని అంటున్నారు.

18 నుంచి రీ సర్వేపై రెవెన్యూ గ్రామ సభలు

దెందులూరు: వీఆర్‌ఓలంతా ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న రీ సర్వేపై రెవెన్యూ గ్రామ సభలకు సిద్ధం కావాలని ఆర్డీఓ అచ్యుత అంబరీష్ అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామ సభలు ముగిసే వరకు డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రామ సర్వేయర్లు అంకితభావంతో పనిచేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం, ధాన్యం కొనుగోలుకు సంబంధించి అన్ని అంశాలపై రైతులకు జవాబుదారీగా ఉండాలని అన్నారు. రీసర్వే, గ్రామ సభలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ అమలులో అలసత్వం లేకుండా విధులు నిర్వహించాలన్నారు. నిత్యం ఈ రెండు కార్యక్రమాలను అధికారులు పర్యవేక్షణ చేస్తారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.సుమతి, డిప్యూటీ తహసీల్దార్లు ప్రియదర్శిని, కృష్ణస్వామి, ఆర్ఐ హేమమాలిని, వీఆర్‌ఓల సంఘం అధ్యక్షుడు కిషోర్ పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఏలూరు

90102 23729

95055 08399

79955 66352

Office mail : tpgadvt@gmail.com